
ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు

విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరిస్తాం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్ హామీ ఇచ్చారు. మంగళవారం బర్కత్‌పురాలోని ఆయన నివాసంలో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ప్రతినిధి సంఘం సభ్యులు బల్మూరి వెంకట్‌ను కలిసి వినతిపత్రం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేతివృత్తులకు పూర్వవైభవం తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. విశ్వబ్రాహ్మణ్, విశ్వకర్మసంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటచారి, రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, కోశాధికారి రవీంద్రచారి, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న డిస్టిక్ గవర్నర్ మహేంద్ర కుమార్‌రెడ్డి

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ముషీరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకున్నప్పుడే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని లయన్స్ క్లబ్ డిస్టిక్ గవర్నర్ మహేంద్రకుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం హిప్నో పద్మాకమలాకర్, నవభారత లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ముషీరాబాద్ మానసిక దివ్యాంగుల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, గుడ్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ అధ్యక్షురాలు పద్మాకమలాకర్, అంజయ్య, గోపాలకృష్ణ, వినయ్, స్వరూపారాణి, లలిత తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

ముషీరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్‌లో సత్యసాయిబాబా ట్రస్ట్ గాంధీనగర్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 50 మంది పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్‌కుమార్ పేదలకు 5 కిలోల బియ్యం, పప్పు, నూనె, చెక్కెర, పిండి, టీ పౌండర్ తదితర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు సీతారామరాజు, రాజ్‌గోపాల్, మదన్‌మోహన్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పేదలకు సరుకులు పంపిణీ చేస్తున్న బిజ్జి కనకేష్‌కుమార్

డ్రైనేజీ పనులను వేగంగా పూర్తి చేయాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ దోమలగూడ తాళ్లబస్తీలో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ సూచించారు. మంగళవారం తాళ్లబస్తీలో నిర్మిస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ జి రచనశ్రీ, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీధర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌లతో కలిసి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రైనేజీ పనులు ఆలస్యం అవుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్టు ప్రజలు ఆమెకు వివరించారు. నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకుసూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.ప్రభాకర్ గంగపుత్ర, బస్తీవాసులు, అధికారులు పాల్గొన్నారు.


పైప్‌లైన్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ, అధికారులు

కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధిపై కేటీఆర్ చర్చకు రావాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రిగా జి.కిషన్‌రెడ్డి ఐదేళ్లలో రాష్ట్రానికి తెచ్చిన నిధులపై మాజీమంత్రి కేటీఆర్ బహిరంగ చర్చకు రావాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు సవాల్ విసిరారు. కేంద్ర నిధులతో చేసిన అభివృద్ధి బీఆర్ఎస్ నేతలకు కనిపించడం లేదని ఆయన ధ్వజమెత్తారు. మంగళవారం బర్కత్‌పురాలోని పార్టీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గం విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో కిషన్‌రెడ్డిపై కేటీఆర్ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కేటీఆర్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు.


మాట్లాడుతున్న గౌతమ్‌రావు


విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

ముషీరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక దృక్పథంతో అందరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న స్పెషల్ క్లాసులను పురస్కరించుకొని రాజపేల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆర్.ఆంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేసే అల్పాహార కార్యక్రమాన్ని ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సేవా సంస్థలు, వ్యాపారులు మానవత దృక్పథంతో పేద విద్యార్థులకు చేయూతనందించి ఉన్నత విద్య అభ్యసించేలా సహకరించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు సుధీర్‌రెడ్డి, ముప్పిడి నర్సింగ్‌రావు, గోరేభాయి, ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి, ఉపాధ్యాయులు నరేందర్‌యాదవ్, స్కూల్ కార్యదర్శి రత్నం పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ప్రతినిధులు

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లిలో ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాల పంపిణీకి సహకారం అందించి న్యాయం చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం కొమరెల్లి, ప్రధాన కార్యదర్శి తూము అశోక్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి జి సూర్యకళ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి త్వరితగతిన నివేదిక అందించి తమకు న్యాయం చేయాలని కోరినట్లు వారు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మానవతా దృక్పథంతో తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని వారు కోరారు. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విన్నవించామని పూర్తి వివరాలను జిల్లా కలెక్టర్ల నుంచి తీసుకుంటామని వివరించారని వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కె.యాదగిరి, ఝాన్సీరాణి, డి.పవన్‌కుమార్, అబ్దుల్ సాదిక్, కె లక్ష్మణ్‌రావు, ఎం.స్వర్ణకుమారి, కె.జయసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బస్తీవాసులకు స్థలాలు ఇవ్వాలి: కోదండరాం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బస్తీవాసుల ఇళ్లను కూల్చివేసి నిరాశ్రయులను చేయడం సరి కాదని, ఇళ్లు కూల్చివేసిన బస్తీవాసులకు వెంటనే న్యాయం చేయాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోదండరాం విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానందనగర్ బస్తీవాసులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. బస్తీవాసులకు వెంటనే పునరావాసం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సమస్యపై సమగ్రంగా అధ్యయనం చేసి అధికారులతో, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి తగు న్యాయం చేసే విధంగా కృషి చేస్తామని హామీనిచ్చారు. దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపినవారిలో గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ఎం.నరసయ్య, ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రవీందర్‌యాదవ్, కవాడిగూడ అధ్యక్షుడు అజయ్‌గౌడ్, నగర కార్యదర్శి జయపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ ముషీరాబాద్ అధ్యక్షుడు వెంకటయ్య తదితరులు ఉన్నారు.



బస్తీవాసుల దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న ప్రొ.కోదండరాం

సీఎంపై విమర్శలు చేసే నేతల భరతం పడతాం

● కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై నోటికి వచ్చినట్లు విమర్శలు చేసే బీఆర్ఎస్ నేతల భరతం పడతామని కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి రోహిణ్‌రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ఇష్టం వచ్చినట్లు దూషిస్తూ విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ విమర్శలను తక్షణమే మానుకోకపోతే నగరంలో బీఆర్ఎస్ నేతలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని, అవినీతి, అక్రమాలను పెంచి పోషించారని ఆరోపించారు. దీనిని కప్పిపుచ్చుకోవడానికి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని వారికి విమర్శించే నైతిక హక్కులేదని ఆయన స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు తిరగబడతారని ఆయన హెచ్చరించారు.


మాట్లాడుతున్న డాక్టర్ రోహిణ్‌రెడ్డి

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం విజయవంతం

గోల్నాక, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): ఛే నెంబర్‌లోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గం ఆత్మీయ సమ్మేళనం విజయవంతం కావడంతో పార్టీ శ్రేణులలో ఫుల్ జోష్ కనిపించింది. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకావడంతో పార్టీ శ్రేణులు కూడా అధిక సంఖ్యలో హాజరయ్యారు. కేటీఆర్ హాజరయే లోగా పలువురు సమావేశంలో మాట్లాడుతూ.. సీనియర్ నేతలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, అతిథులకు విన్నవించుకున్నారు. కేటీఆర్ హాజరయ్యాక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ.. పలువురు నేతలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను ఆ యన దృష్టికి తీసుకెళ్లారు. అందరికీ తగు న్యాయం చేయాలని కోరగా ఆ దిశగా న్యాయం చేస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల ప్రజలకు వివరించాలని సూచించారు. మాజీ కార్పొరేటర్లు కాలేరు పద్మావెంకటేష్, వనం రమేష్, ఎడ్ల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్, కాలేరు వెంకటేష్, మహమూద్ అలీని సత్కరిస్తున్న బి.పద్మావెంకటరెడ్డి

న్యాయవ్యవస్థలో సంస్కరణలకు బీజం వేసిన శివశంకర్

కవాడిగూడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ పి.శివశంకర్‌కే దక్కుతుందని ఆయన కుమారుడు డాక్టర్ వినయ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దుర్గం రవీందర్‌పటేల్, మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అఫెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తంరావు కొనియాడారు. న్యాయవాదిగా కేంద్ర న్యాయశాఖ మంత్రిగా పనిచేసి ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారని, ఈ రోజు న్యాయవ్యవస్థ బలోపేతంగా ఉండటం లో శివశంకర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. మంగళవారం పి.శివశంకర్ వర్ధంతి సందర్భంగా లిబర్టీ సమీపంలోని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీల సంక్షేమానికి శివశంకర్ ఎంతో కృషి చేశారన్నారు. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు సాధించినప్పుడే పి.శివశంకర్‌కు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్, తెలంగాణ బీసీ హిందూ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్‌పటేల్, ప్రధాన కార్యదర్శి పర్వత సతీష్, జాతీయ బీసీ జేఏసీ అధ్యక్షుడు సాయిని నరేందర్, మున్నూరు కాపు మహిళా పరపతి సంఘం చైర్మన్ తెప్ప అరుణ పటేల్, నాయకులు మల్లయ్య పటేల్, బత్తుల రాంనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.


శివశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వినయ్‌కుమార్, రవీందర్‌పటేల్, పురుషోత్తం తదితరులు


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళా నేతలు

ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం

రాంనగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆరు పథకాలు వంద రోజుల్లో అమలు చేయనున్నట్లు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షుడు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. మంగళవారం గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించడాన్ని స్వాగతిస్తూ ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేటలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై క్షీరాభిషేకం చేసి అనంతరం మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజునే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారని చెప్పారు. ఇప్పటికీ నాలుగు పథకాలు అమలు చేశారని మిగిలిన రెండు పథకాలు కూడా మరికొద్దిరోజుల్లోనే అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలందరూ ఓటు వేసి అత్యధిక స్థానాలు గెలిపించి రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని కోరారు. అంబర్‌పేట నియోజకవర్గంలో మాజీ ఎంపీ వి హనుమంతరావు, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రోహిణి రెడ్డిల ఆధ్వర్యంలో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టం అవుతుందన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ రిషికాంత్ తదితరులు

విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి

రాంనగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో విద్యార్థులు ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలో మెలుకువలు పాటిస్తూ ఉద్యోగాలు పొందేందుకు విద్యార్థులు కృషి చేయాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్ సూచించారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ కళాశాల ప్లేస్‌మెంట్ ట్రేనింగ్ విభాగంఆధ్వర్యంలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ రిషికాంత్ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగాల సాధనకు సంబంధించిన మెలుకువలను విద్యార్థులకు వివరించారు. త్వరలో పలు కంపెనీలతో అంబేద్కర్ కళాశాలల అవరణలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ జరుగుతుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యాసంస్థల హెచ్ ఆర్ హెడ్ రాజ్‌కుమార్, మణికంఠ, ప్రిన్సిపాల్ శేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.

కుమార్తె ఇంటికి వెళ్లొచ్చేసరికి చోరీ

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ జరిగింది. వివేక్ నగర్‌కు చెందిన గోపాలకృష్ణ రిటైర్డ్ ఉద్యోగి. ఇటీవల నానక్‌రామ్‌గూడలోని తన కుమార్తె ఇంటికి వెళ్లారు. మంగళవారంపై అంతస్థులోని వారు కిందికి వచ్చి చూడగా గోపాలకృష్ణ ఇంటి తాళం పగులగొట్టి ఉంది. సమాచారం అందుకున్న బాధితుడు ఇంటికి వచ్చి చూసుకోగా తులం బంగారం, రెండు వాచీలు చోరీ అయినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చాడు.


అవార్డు ప్రదానం చేస్తున్న జీఎం అరుణ్‌కుమార్‌జైన్

ఉత్తమ ఉద్యోగులకు మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, అంకితభావంతో విధి నిర్వహించిన 12 మంది ఉద్యోగులకు 'మ్యాన్ ఆఫ్ ది మంత్' భద్రతా అవార్డులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్ ప్రదానం చేశారు. సికింద్రాబాద్ రైల్‌నిలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డీఆర్ఎంలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం రైల్వే జీఎం అరుణ్ కుమార్‌జైన్ మాట్లాడుతూ భద్రతా విధానాలను అనుసరించడంలో, ఇతర ఉద్యోగులను ప్రేరేపించడానికి అవార్డులు దోహదపడతాయని అన్నారు.

బీఆర్ఎస్ నేతకు ఎమ్మెల్యే పరామర్శ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అస్వస్థతకు గురైన బీఆర్ఎస్ సీనియర్ నేత ఎస్టీ అశోక్‌ను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మంగళవారం సాయంత్రం పరామర్శించారు. కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో చికిత్స పొంది జవహర్‌నగర్‌లోని ఇంటికి వచ్చిన అశోక్‌ను గోపాల్‌తో పాటు పార్టీ యువనేత జైసింహ పరామర్శించి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఎప్పటికప్పుడు తన ఆరోగ్య పరిస్థితిని తనకు తెలియజేయాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అశోక్‌కు సూచించారు. పార్టీ నాయకులు రాకేష్‌కుమార్, శ్రీకాంత్, ముచ్చకుర్తి ప్రభాకర్, పున్న సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్టీ అశోక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సోలార్ విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్య ఘర్ బిజిలీ యోజన సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ గౌడ్ సూచించారు. ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో మంగళవారం తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకంపై సెమినార్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన సోలార్ యూనిట్ల కాంట్రాక్టర్లతో పీఎం సూర్య ఘర్ బిజిలీ యోజన పథకంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి వాతావరణం అనుకూలంగా ఉంటుందని, పీఎం సూర్య ఘర్ ఉచిత పథకంతో దరఖాస్తు చేసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతుందన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శీహరిబాబు, ఉపాధ్యక్షుడు రాజేష్ పరకాల, సంయుక్త కార్యదర్శులు బాబు నాయుడు, శ్రీనివాస్, రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన సోలార్ ప్యానల్స్ ఇంటిగ్రేటర్స్ ప్రతినిధులు హాజరయ్యారు,


మాట్లాడుతున్న అశోక్‌కుమార్‌గౌడ్

3 కిలోవాట్లకు రూ. 78 వేల రాయితీ

పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకంలో 1 కిలో వాట్‌కు రూ. 30 వేలు, 2 కిలో వాట్స్ వరకు రూ. 60 వేలు, 3 కిలో వాట్ నుంచి 10 కిలోవాట్ వరకు రూ. 78 వేల రాయితీని కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇదే తరహాలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటుచేసుకునే వారికి రాయితీ అందిస్తే రాష్ట్రవ్యాప్తంగా సోలార్ విద్యుత్‌ఉత్పత్తి చేసేవారి సంఖ్య లక్షల్లోకి చేరుకుంటుందని, దీంతో పీక్ అవర్‌లో ఇతర రాష్ట్రాలనుంచి అధిక ధరకు విద్యుత్ కొనాల్సిన అవసరం తగ్గిపోతుందని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు కార్యాలయాల్లో సోలార్ ప్లాంట్లు పెద్దఎత్తున అందుబాటులోకి తీసుకురావాలని, భవిష్యత్‌లో డిస్కంలు ఇచ్చే విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ నెట్‌మీటర్లు ఇవ్వాలని అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



● పనుల పరిశీలన

కాచిగూడ డివిజన్ చప్పల్ బజార్‌లో నిర్మిస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను మంగళవారం కార్పొరేటర్ కన్నె ఉమాదేవి పర్యవేక్షించారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, జలమండలి ఏఈ భావన, మేనేజర్ వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదుట 219 నెంబర్ బస్టాపు వద్ద మంగళవారం పుట్‌పాత్‌పై అపస్మారకస్థితిలో పడి ఉన్న 80 ఏళ్ల వృద్ధురాలిని పెట్రోలింగ్ కానిస్టేబుల్ రాము గమనించి గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే ఆమె మరణించింది. మృతురాలి ఒంటిపై ఎరుపురంగు జాకెట్, పూలరంగు చీర ఉన్నట్టు గోపాలపురం ఎస్సై వేణుగోపాల్ తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రిలో మార్చురీలో భద్రపరిచామని, మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు 8712660248, 8712661249లలో సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

సెలబ్రిటీ క్రికెట్ లీగ్‌కు కట్టుదిట్టమైన భద్రత

● రాచకొండ సీపీ తరుణ్ జోషి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మార్చి 1 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న సెలబ్రిటీ క్రికెట్ లీగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ సీపీ తరుణ్‌జోషి తెలిపారు. ఈనెల 17న ప్రారంభమైన పదో ఎడిషన్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్-2024 పోటీలో భాగంగా మార్చి 1 నుంచి 3 వరకు టి-20 మ్యాచ్‌లు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వివిధ భాషల సినీతారలు పాల్గొనే క్రికెట్ మ్యాచ్‌లకు భారీ సంఖ్యలో ప్రేక్షకులు వచ్చే అవకాశం ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. టికెట్ల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని, సెలబ్రిటీ క్రికెట్ లీగ్ ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. స్టేడియం పరిసరాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, భద్రతను పర్యవేక్షించాలన్నారు. పార్కింగ్ ఏర్పాట్ల విషయంలో గందరగోళం లేకుండా చూడాలన్నారు. మల్కాజిగిరి డీసీపీ పద్మజ, డీసీపీ(ఎస్‌బీ) కరుణాకర్, డీసీపీ(క్రైమ్స్) అరవింద్‌బాబు, ఎస్‌బీ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, మల్కాజిగిరి ఏసీపీ పురుషోత్తంరెడ్డి, కుషాయిగూడ ఏసీపీ నరేష్‌రెడ్డి, ఏసీపీ నరేందర్‌గౌడ్, సెలబ్రిటీ క్రికెట్ లీగ్ ఫౌండర్ విష్ణువర్ధన్‌ఇందూరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాచకొండ సీపీ తరుణ్ జోషి

ఖరీదైన వాహనాలే టార్గెట్

● ఆంధ్రా నుంచి వచ్చి తెలంగాణలో చోరీలు
● అరెస్ట్ చేసిన పోలీసులు
● ఐదు బైక్‌లు స్వాధీనం

మంగళ్‌హాట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి నగరంలో ఖరీదైన వాహనాలను దొంగిలిస్తున్న ముఠాను సుల్తాన్ బజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన జి.రామాంజనేయులు(21), గోగుల గోపాలకృష్ణ(20), షేక్ కసినపల్లి బాషా (24)లు ఒక ముఠాగా ఏర్పడి తెలంగాణాలోని పలు ప్రాంతాల్లో ఖరీదైన బైక్‌లను దొంగిలించేవారు. గత ఏడాది అక్టోబర్‌లో హైదరాబాద్ గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బైక్‌ను, నవంబర్‌లో అఫ్జల్‌గంజ్ పీఎస్ పరిధిలో మరోబైక్‌ను దొంగిలించి గుంటూరుకు తరలించారు. ఈనెలలో సూర్యాపేట టూ టౌన్ పీఎస్ పరిధిలో రెండు బైక్‌లను, హైదరాబాద్ సుల్తాన్‌బజార్ పరిధిలో ఒక బైక్‌ను దొంగిలించి మహాత్మాగాంధీ బస్‌స్టేషన్(ఎంజీబీఎస్) పార్కింగ్‌లో పార్క్ చేశారు. మూడు రోజుల క్రితం గుంటూరు నుంచి మిగతా రెండు బైక్‌లను విక్రయించేందుకు నగరానికి తీసుకువచ్చి ఎంజీబీఎస్‌లో పార్క్ చేశారు. వీటిని అమ్మేందుకు రెండు బుల్లెట్ బైక్‌లపై ముగ్గురు నిందితులు మంగళవారం కాచిగూడ ఎక్స్‌రోడ్ మీదుగా కింగ్ కోఠికి వెళ్తుండగా అక్కడే తనిఖీలు చేస్తున్న సుల్తాన్‌బజార్ పోలీసులు వారిని ఆపారు. వారి కదలికలు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని రెండు బుల్లెట్ బైక్‌ల నెంబర్లను పరిశీలించి దొంగిలించిన వాహనాలుగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఆంధ్రా నుంచి బస్సులో వచ్చి దొంగిలించిన వాహనాలను కింగ్‌కోఠిలో అమ్మేందుకు ప్రయత్నిస్తున్నట్లు తేలింది. దీంతో ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

చోరీ చేసి.. ఎంజీబీఎస్ పార్కింగ్‌లో దాచి

ఖరీదైన బుల్లెట్ వాహనాలే టార్గెట్‌గా వారు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. లాక్ చేసి ఉన్న బుల్లెట్ వాహనాన్ని దొంగిలించి నేరుగా ఎంజీబీఎస్‌లోని పార్కింగ్ ప్రాంతంలో పెట్టి ఒక్కొక్కటిగా అమ్మాలనేది నిందితుల ఉద్దేశమని అధికారులు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. నిందితుల అరెస్ట్‌లో కీలకంగా వ్యవహరించిన సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ కొత్తపల్లి ముత్తుతో పాటు అతని బృందాన్ని డీసీపీ రావుల గిరిధర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ కె ముత్తు ఉన్నారు.



నిందితులు, వారు దొంగిలించిన వాహనాలతో పోలీసులు